



# మన రచయిత/త్రులు

## మద్దూరి రాజ్యశ్రీ

*'మన రచయిత/త్రులు' పేరిట శ్రీమతి రాజ్యశ్రీ ఒక్కొక్క రచయిత / రచయిత్రిని విశ్లేషిస్తూ, వాళ్ళ నవల నొకదానికి సమీక్ష రాస్తారు. శ్రీమతి రాజ్యశ్రీ ఎమెస్కో అధినేత శ్రీ యం.యన్.రావుగారి అమ్మాయి. ఆమె 200 పైగా నవలలకు ఎడిటోరియల్ వర్క్ చేశారు. రీడర్స్ రిపోర్టు రాయటం, బాక్ కవరు మేటర్ రాయటం, పుస్తక ప్రపంచంలో రాబోయే నవలకు సమీక్ష రాయటం చేశారు. ఆ అనుభవంతో ఇప్పుడు మన కౌముది ద్వారా మీ ముందుకు వస్తున్నారు.*

## యద్దనపూడి సులోచనారాణి - ప్రేమ సుమాల రాణి

**యుగయుగాలుగా** కవులు వర్ణించి, మనుష్యులు అపురూపంగా భావించే ఈ ప్రేమ చాలా విచిత్రమైనది. ఇది మనుష్యులకి ఆకాశమంత విశాలమైన హృదయం ఇవ్వగలదు. సూది బెజ్జమంత స్వార్థంగానూ మారిపోగలదు. కావాలనుకుంటే స్వర్గం చూపిస్తుంది. వద్దనుకుంటే భయంకరమైన నరకంలో చిత్రహింసలు చేస్తుంది.

ఆంధ్రుల ఆరాధ్య దేవత, కలలరాణి, నవలారాణి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారి, అశేష ఆంధ్ర జనాన్ని ఉర్రూతలూగించిన సెక్రటరీ నవలలో రాజశేఖర్‌గారి విశ్లేషణ ఇది. ఈ నవలని ఆవిడ 'అశేష అభిమానంతో ప్రోత్సాహం అనే ఉప్పెనలో నన్ను ముంచి తేల్చిన పాఠకులకి అంకితం' ఇచ్చారు.

రాజశేఖర్ అన్నట్టుగా ప్రేమని కవులు యుగయుగాలుగా వర్ణించారు. అసలు ప్రేమకథలంటే విషాదాంతం ఉండాలనే అపోహ మనలో ఉంది. అందుకు ఉదాహరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన దేవదాసు, లైలామజ్ను, అనార్కలీ లాంటివి. కానీ ఈ అపోహని ఉప్పెనలా కొట్టేసింది సులోచనారాణి ప్రథమ నవల సెక్రటరీ. ఆవిడ 75 నవలలదాకా రాసారు. ఇంచుమించు అన్నీ ప్రేమకథలే. అన్నీ సుఖాంతాలే.

అన్నీ సుఖాంతాలే ఎందుకు అని మనకి సందేహం కలక్కుండా ఉండదు. రాధాకృష్ణ నవల వచ్చినప్పుడు రాధాకృష్ణులు పెళ్ళిచేసుకోరు కాబట్టి ఇది సుఖాంతం కాదని కొంతమందీ, లేదు ఆవిడ నవలలు సుఖాంతాలే కాబట్టి ఇది కూడా అంతేనని కొంతమందిమి పందేలు వేసుకున్నాం కూడా! ఆవిడిని అడిగితే 'ఎలా ముగించమంటారు?' అన్నారు కానీ చెప్పలేదు. సెక్రటరీ పుస్తకం రీప్రింటుతో పాటు ఆవిడ స్వయంగా మాట్లాడిన ఆడియో క్యాసెట్ కూడా రిలీజ్ చేశారు. అందులో ఆవిడే విశ్లేషణ ఇచ్చారు.

'శేఖరం చేయి చాచి తన నుదురు తాకి జ్వరం ఉందో లేదోనని చూడటం, మెల్లగా జుట్టుపైకి తీసి సవరించటం తెలిసింది. ఇతనికింత చనువు, అధికారం ఎప్పుడొచ్చింది, ఎవరిచ్చారు, కానీ ఆ స్పర్శలో ఎంత ఆప్యాయత ఉంది? జయంతికి హఠాత్తుగా ఆ చేతిని తన రెండు చేతుల్లోకి లాక్కుని తను పెనవేసుకుని నిద్రపోవాలనిపించింది.'

'ఈ సన్నివేశాన్ని మళ్ళీ చదువుకున్న తర్వాత ఇంత మంచి రాజశేఖరాన్ని, ఇంత ప్రేమగా చూసే ఈ హీరోని నేనెందుకు చంపివేయాలని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నన్నెవరైనా బాధపెడితే సహించలేనే, అలాంటిది ఇంత మంది అభిమానించే రాజశేఖరంని చంపి నేనెలా బాధపెడతాను? అతన్ని చంపేస్తే అందరు తిడతారేమో! నాకే అంత సహనమూర్తి, ప్రేమమూర్తి అయిన రాజశేఖరం జీవితం ముగించటానికి చేతులు రాలేదు. నాకు హక్కు లేదనిపించింది. అతన్ని చంపేస్తే అందరికీ ఈ ప్రపంచంలో మంచి మగవాళ్ళకి మనుగడ ఉండదని నేనొక నెగిటివ్ దృక్పథం ఇస్తానేమోనని భయపడ్డాను. అదే తర్వాత నవలల్లోకి కూడా పాకింది' అన్నారు ఆవిడ.

ఆవిడ హీరోలు ఏం చదివారన్నది మనకనవసరం. ఆ మాటకొస్తే ప్రత్యేకించి ఎందులోనూ దాన్ని నొక్కి వక్కాణించినట్టుగా కనబడదు. కానీ ఆవిడ హీరోల్లో ఒక విధమైన రాజసం, ఠీవి, గాంభీర్యం ఉట్టిపడుతుంది. 'పరిపూర్ణంగా వికసించిన వ్యక్తిత్వంతో, గంభీరంగా నిండుగా, హుందాగా ఉన్నాడు. ఒక చేతి మీద అలా వెనక్కి జారగిలబడి కూర్చోటంలో కూడా రాజసం ఉట్టిపడుతోంది.'

ఇకపోతే హీరోయిన్ అందమైనదే అందులో ఏమాత్రం సందేహం లేదు. కాస్తంత తెలివితేటలు, కాస్త పొగరు, ఒక్కోసారి అమాయకత్వం బోలెడంత మంచి తనం కలగలిపి ఉంటాయి. అయితే బాగా డబ్బున్న వాళ్ళింట్లో గారబంగా పెరిగిన ఒక్కత్తే కూతురుగానో, లేదా చాలా బీదవాళ్ళింట్లో బామ్మ పంచనో, అత్తపంచనో పెరుగుతున్న ఆత్మాభిమానం గల పిల్లగానో ఉంటుంది. 'విజయ్‌కి ఆ పోట్లాట, రోజా నిర్భయంగా దెబ్బలాడే తీరు, ఆ నిక్కచ్చితనం, మృదువైన ఆ కంఠస్వరంలో ఆమాటల వెనక దాక్కుని ఉన్న కర్కశత్వం అతనికి నచ్చాయి. రోషంతో తళతళలాడుతున్న కళ్ళు, చుట్టుపక్కల వాళ్ళు చూస్తున్నారనే అసహ్యం, తక్కువ వాడితో మాటలు పెంచుకుంటున్నాననే ఏవగింపు వీటన్నిటితో రోజా సుందర ముఖం ఆకర్షణీయంగా ఉంది.'

'హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ అంకురించటం కూడా చాలా సున్నితంగా ఉంటుంది. వాళ్ళ మధ్య చనువు పెరగటం చాలా అపురూపంగా ఉంటుంది. హఠాత్తుగా విజయ్ తల ఆమె పొట్టకి ఆనింది. అతని రెండుచేతులూ ఆమె నడుం చుట్టూ బిగుసుకున్నాయి... తమకి ఇష్టమైనది, తమ నుంచీ ఈ కాలంలోకి జారిపోతూ ఉనికిని చెరిపేసుకుంటూంటే... ఒకరికి ఒకరు ధైర్యం చెపుతూ, ఊరట ఇస్తూ మనస్సుని బ్రతికించుకోవటానికి చేస్తున్న ప్రయత్నంలా ఉంది.'

'తను జీవితంలో పుట్టిబుద్ధి తెలిసిన తర్వాత ఎన్నడూ ఎరుగని, ఒక భద్రతా సుఖం, ఒక నిశ్చింత, జీవితంలో ఒక నిజమైన తోడు, ఒక ఆలంబన ఉమ స్పర్శలో తను పొందాడు.' ఒక్క సన్నివేశంలో ఎన్ని భావాలు చొప్పిస్తారో చూపటానికి ఇదొక మచ్చుతునక.

ఆవిడ శైలి ప్రత్యేకంగా ఉంటుంది. 'ప్రపంచంలో ఉన్న వెన్నెల ఆనందం అంతా కొంగున మూట కట్టుకుని తెచ్చి తనమీద గుమ్మరించినట్టు, తనని ఆత్మానందంలో ముంచి తేల్చేస్తుంది!' 'బాప్‌రే', 'అతని దవడ ఎముక బిగుసుకుంది', 'అలా లోగొంతుకలో మాట్లాడుతుంటే మృదుగంభీరంగా ఉన్న గొంతు అలా వింటుండి పోవాలనిపిస్తుంది!', 'హలో అన్న ఆ గొంతు పడుకుని లేచిన సింహం బద్దకంగా ఒళ్ళువిరుచుకుని గొంతు విప్పినట్టుంది' లాంటివి ఆవిడకి మాత్రమే సొంతం! అలాగే ఆశ్చర్యార్థకం కూడా!

అనంత్‌లాంటి స్నేహితుడు, రాజశేఖర్ లాంటి భర్త, వేణుగోపాలరావు గారి లాంటి మామయ్య, జయంతి బామ్మ లాంటి బామ్మ, సునందలాంటి స్నేహితురాలు, ఉమలాంటి భార్య, డాక్టరు దంపతులలాంటి అండదండలు కావాలనుకుంటారు ఎవరైనా! పేర్లు కూడా మనం రోజూ వినే మనకి బాగా తెలిసిన వాళ్ళవే. శివరాం ప్రసాద్ లావణ్య, విజయ్, చెందూ, మాధురి, ఉమ వగైరా.

కథల్లో బాధలు, విషాదాలు క్యారెక్టర్ల ద్వారా పాఠకుల అంతర్యాన్ని స్పృశించాలేకానీ ముగింపులయి వారిని క్షోభపెట్టకూడదు అన్నారు ఆవిడ. అందుకే ఆవిడ నవలల్లో జీవితం మీద సందేశాలు చాలా ఉంటాయి. పరిస్థితులకి భయపడి పారిపోకూడదు, ఎదురీదాలి అన్న భావం చాలా విధాలుగా చూపిస్తారు.

'నా దృష్టిలో మంచి రచన లక్షణం ఏమిటంటే రచయిత తనదైన శైలిలో సృజనాత్మకత నిండిన భావశైలితో పాఠకుల హృదయాలని స్పృశించగలగాలి' అన్నారు. ఆవిడ శైలి అంత ప్రత్యేకంగా ఉంటుంది కాబట్టి, ఆవిడ వర్ణన అంత కళ్ళకు కట్టినట్టు ఉంటుంది కాబట్టి, పాఠకుల హృదయాల్లో పెద్ద పీట వేసుకుని మరీ తిష్టవేసుకుని కూర్చోగలిగారు.

## మీనా




'నీకు వయస్సు వచ్చింది, బుద్ధి తెలిసింది, పెద్దదానివి అయ్యావు, ఇదివరకులా నిన్ను ఓ చెంపదెబ్బ వేసి నీ చేత పనిచేయించే స్థితి దాటిపోయింది. ఒక విషయం పదిసార్లు చెప్పే అలవాటు నాకెప్పుడూ లేదని నీకు బాగా తెలుసు. తెలిసికూడా ఇలా నన్నెందుకు విసిగిస్తావు?" అంటుంది నియంత లాంటి తల్లి కృష్ణవేణమ్మ.

'అమ్మ చాలా సమర్థురాలు. నేనెప్పుడూ కాదనను. నామీద ఆవిడకి ఆపేక్ష లేదని కూడా నేను అనను. ఇంతమంది మనస్తత్వాలని ఇంత సులభంగా అర్థం చేసుకోగలిగిన అమ్మ ఇంట్లో ఉన్న నన్నూ, మా నాన్ననీ ఎందుకు అర్థం చేసుకోలేదు' అని వాపోతుంది ఆవిడ ఏకైక కూతురు మీనా.

ఆ తల్లీ కూతుళ్ళ మధ్య జరిగే ప్రచ్చన్న యుద్ధంలో పరోక్షంగానో, ప్రత్యక్షంగానో సాయపడుతుంటాడు తండ్రి. ఈ ప్రపంచంలో నాకున్నది మీనా ఒక్కత్తే. దానికెలాంటి హాని జరిగినా నేను భరించలేను అంటాడు వాళ్ళ నాన్న హనుమంతరావు.

'మా అమ్మ ఇప్పుడే కాదు. నేను పుట్టిన ఈ ఇరవైరెండు సంవత్సరాలలోనూ నేను కోరినది జరిపించలేదు, అడిగినది ఇవ్వలేదు. అలా చేస్తే అతి గారాబం, పోయి, అసలే మొండిదాన్ని అయిన నేను ఇంకా రణపెంకిగా తయారవుతానేమోనని ఆవిడ భయం. తానసలు ఇంత జగమొండి అవటానికి కారణం అమ్మేనని, నాన్న ఎప్పుడూ అంటూనే ఉంటారు. మా ఇద్దరి మధ్య సృష్టికంతా అత్యంత మధురమైన తల్లీకూతుళ్ళ బాంధవ్యం లేనేలేదు. ఎన్నో స్వతంత్ర భావాలుకల అమ్మ, బైట ప్రపంచంలో ఎంతో సరళ హృదయురాలు అనిపించుకునే అమ్మ, తనకి ఏకైక సంతానం అయినా నా విషయంలో ఇలా నియంతలా ఎందుకు ప్రవర్తిస్తుందో నాకు అర్థంకాదు.'

అలాగని మీనాకి, అమ్మ మీద ద్వేషమేం లేదు. 'నిజంగా మనందరిలో ఏకధాటిగా అలా మెప్పు సంపాదించుకోవటం పెద్ద నేర్పే. అలాంటి సమయాల్లో అమ్మని చూస్తుంటే నా గుండెల్లో గర్వంలాంటిది రెపరెపలాడుతుంది' అంటుంది కానీ ' ఆవిడ చూపించే ఆపేక్ష కేవలం మాకు బాధ్యతగా కనిపిస్తుంది. మా నాన్న అలా కాదు. ఆయనకు యావత్ ప్రపంచం నేనేనేమో అనిపించే సమయాలు చాలా ఉన్నాయి. నాకు జ్వరం లాంటిది వచ్చి ఏదయినా సుస్తీ చేస్తే మా అమ్మ వెంటనే మంచి డాక్టర్ ని పిలిపించి, నాకు సరైన మందు తెప్పించి, అది ఏ వేళకు వేయాలో తాయారమ్మకి అప్పగించేసేది. అంతటితో ఆవిడ బాధ్యత తీరిపోయేది. కానీ మా నాన్న అలాకాదు. నాకు కాస్త పక్కలు వెచ్చబడగానే తన పనంతా మానుకుని దగ్గరికి వచ్చి కూర్చునేవారు... అమ్మో! మా నాన్న లేకపోతే నేనేమైపోయేదాన్ని అనిపించే క్షణాలు నా జీవితంలో లక్షలూ, కోట్లూ ఉన్నాయి. '

మీనాకి కృష్ణవేణి తన క్లబ్బు ఫ్రెండయిన మిసెస్ లింగంగారి తమ్ముడు కొడుకు సారథితో పెళ్ళి నిశ్చయం చేస్తుంది. ఆవిడకి సారథి చాలా నచ్చుతాడు. 'మనిషిలో ఠీవి, దర్పం ఉన్నాయి. రాజసం ఉట్టిపడుతోంది అని వర్ణిస్తుంది. అదే మనిషి మీనాకస్సలు నచ్చడు.

'ఆ నవ్వు మరీను. అతని ముఖంలో నవ్వు గోడకి మేకు తగిలించినట్టు ఉంటుందే తప్ప సహజంగా ఉండనే ఉండదు. పైపెదవి బిగపట్టి, క్రింద పెదవిని కుడివైపుకి సాగలాగుతాడు. పూర్తిగా నవ్వేస్తే ఆయన సొమ్ము ఏం పోతుందో మరి' అనుకుంటుంది.

'వెళ్ళేటప్పుడు నాతో కూడా చెప్పాడు. కానీ అందులో ప్రత్యేకత ఏమీ లేదు. కృష్ణవేణమ్మగారి కూతుర్ని కాబట్టి చెప్పాలనుకుని చెప్పినట్టుంది. కాని క్షణంలో సగం సేపు నా వేపు చూసిన ఆ చూపుల్లో ఒక విధమైన ఆకలి ఉన్నట్టు నేను పసిగట్టను. స్త్రీ ఇతని ముందు స్త్రీగాదు. ఏ జిలేబి ముక్కలానో, మైసూర్ పాక్‌లానో కనిపిస్తుంది. ఆడపిల్లని తను జిలేబీలా భావించి, అందితే అమాంతం కొరుక్కుతినేయాలనే మనస్తత్వం, ఆశా, ఆకలీ గల మనిషిలా ఉన్నాడతను.'

'అంతేకాదు ఇంకోటి కూడా నాకు బాగా తెలిసింది. అతని ప్రవర్తనలో కనిపిస్తున్న ఆ అణుకువ, ఆ విధానం, ఆ అతివినయం, మర్యాదా ఇవి స్వతః సిద్ధంగా వచ్చినవి కావనీ, తెచ్చిపెట్టుకున్నవి అనీ బాగా తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే అవన్నీ అమ్మ లక్షణాలు. అమ్మ వ్యక్తిత్వం లాంటి వ్యక్తిని నేను చేస్తే భర్తగా స్వీకరించను. నా జీవితానికి ఒక నియంత చాలు' అని తండ్రితో తెగేసి చెప్పేస్తుంది. తండ్రితో ఉన్న ఆ చనువుతోనే పెళ్ళిమీదా తనకున్న ఆశలు ఏమిటో మనస్సు విప్పి చెపుతుంది. 'నన్ను పెళ్ళి చేసుకుని నా ఇంట్లో స్థానం కావాలి అనుకునే వాడు నా కవసరం లేదు. తన ఇంట్లో భర్తా, పిల్లా జెల్లా మధ్య ప్రశాంత వాతావరణం కల్పించాలని కలలు కంటున్న నాకు తోడుగా నిలిచి, నా ఆలోచనలు సక్రమంగా ఆచరణలో పెట్టటానికి సాయపడేవాడు నాకు కావాలి. నా అందాన్ని పూజించేవాడు, మా అమ్మ గుణగణాలు కీర్తించేవాడు వద్దు నాకు. మా అమ్మని నా తల్లిగా మాత్రమే గుర్తించి గౌరవించగలిగిన వాడు నాకు కావాలి!

అందుకే తల్లి ఊర్లోలేనప్పుడు 'సారధి వస్తున్నాడు అతని ముందు నువ్వు ఊరికే ఉండటం కాదు. ఆనందంగా హాయిగా సారధి మనస్సు ఆకర్షించుకునేలా ఉండాలి తెలిసిందా?' అని తల్లి తీవ్రంగా చెప్పినా, ఆ టైములో ఎక్కడికైనా పారిపోవాలని మీనా చేస్తున్న ప్రయత్నాలని పసిగట్టిన తండ్రి నిమ్మలూరు పంపిస్తాడు. అక్కడ ఆయన చెల్లెలు కమల, పిల్లలు ఉంటారు. ఆవిడ కూతురు రాజేశ్వరి మీనా ఈడుదే ఉంటుంది. దగ్గరుండి మీనా బట్టలు సర్దిస్తాడు. స్లీవ్‌లెస్ జాకెట్లు వద్దంటాడు. సాధ్యమైనంత వరకూ వాళ్ళలో ఒక పిల్లగా కలిసిపొమ్మని, ఎలాంటి సంకోచం లేకుండా చనువుగా ప్రవర్తించమని కోరతాడు. మీనా కూడా అలాగే వాళ్ళతో కలిసిపోతుంది. మీనా కలిసిపోతుంది అనేకంటే వాళ్ళు కలిపేసుకున్నారంటే సరిపోతుంది. కమలత్తయ్య చాలా ఆపేక్షగా చూస్తుంది. రాజేశ్వరి మధు, మణి అందరూ వదినా అంటూ ప్రేమగా తిరుగుతారు! కమలత్తయ్య పెద్ద కొడుకు కృష్ణ గురించి ఎందుకో తండ్రి ముందు చెప్పడు. అతను అవటానికి సవతి కొడుకైనా, తండ్రిపోయాక ఆ కుటుంబానికి చాలా అండగా నిలబడతాడు. కమలత్తయ్య కూడా, జాగ్రత్తగా చూస్తే కృష్ణ మీదే ఒక పెచ్చు అభిమానం చూపిస్తుంది.

*అక్కడ నేనూ నా ఫ్రెండ్సూ పందాలు వేసుకున్నాం. దీన్ని బట్టి కృష్ణ, మీనాని పెళ్ళి చేసుకోడని ఒక జట్టూ, సులోచనారాణి గారి ప్రేమ కథలు సుఖాంతం కాబట్టి చేసుకుంటాడని ఇంకో జట్టూ.*

మొదట్లో మీనా అతన్ని విలన్ కృష్ణారావు అనీ, పంచి కట్టు వైద్యుడనీ చిన్న చూపు చూస్తుంది. 'నన్ను ఒకసారి నిర్లక్ష్యపరచిన వాళ్ళని నేను మళ్ళీ జీవితంలో కన్నెత్తి చూడను. నా బలహీనత అను ఇంకేదైనా అను అన్న' మీనాయే, రాను రాను అతని మహోన్నతమైన వ్యక్తిత్వం చూసి ముగ్ధురాలవుతుంది.

'ఎంత మామూలుగా కన్పిస్తాడీ మనిషి? ఎంతసేపు తనపనేదో తప్ప ఇంకో గొడవేదీ పట్టించుకోనట్లుండే కృష్ణ ఈ రోజు నాకు వింతగా కొత్తగా కనిపించాడు నేను చాలా సార్లు అతన్ని జడుడుగాను, మందమతిగానూ భావించుకున్నాను.

కానీ, ఈ రోజు సన్నగా, పొడుగ్గా రివటలా ఉండే అతనిలో అజ్ఞాతంగా ఇంత అద్భుతమైన శక్తి దాగి ఉందని కళ్ళారా చూసిన ఈ క్షణంలో నిజంగా చకితురాలినే అయాను.

నోరు చెడ్డదని ఊరంతా భయపడే మంగమ్మ అంటే అతనికి లక్ష్యం లేదు. పొగరుమోతు గొడ్డంటే బెదురు మాత్రం లేకపోగా అలాంటి దాన్ని వడుపుగా వశం చేసుకునే నేర్పు, సాహసం ఉన్నాయి.

సహజంగా మృదు మధురంగా ఉండే అతని స్వరం అవసరం అయితే ఎదుటివారిని నిశ్చేష్టులని చేసేటంత భీకరంగా గర్జించగలదు. తమ్ముడిని, చెల్లెళ్ళని చూసినప్పుడు ప్రేమని, అనురాగాన్ని వర్షించే ఆ కళ్ళు ఆగ్రహావేశాలు వస్తే నిప్పులు కురిపించగలవు.

తనకి ఇష్టమైన దాన్ని ఖచ్చితంగా స్పష్టంగా, నిర్మొహమాటంగా తిరస్కరించగల మొండితనం కూడా ఉంది అతనిలో.

ఈ ఇంట్లో పిల్లలందరూ ఇంత క్రమ శిక్షణగా ప్రవర్తించటానికి అసలు కారణం ఏమిటో హఠాత్తుగా నాకిప్పుడు అర్ధమైంది. పిల్లల్లో ఎవరూ అన్నగారిలో అజ్ఞాతంగా ఉన్న ఈ ఉగ్రనరసింహ మూర్తిని చూడటానికి ఇష్టపడరేమో! '

అంతేకాదు కృష్ణ కూడా వాళ్ళ అమ్మలా కనిపించినా అమ్మకీ అతనికీ ఒక తేడా కూడా గమనిస్తుంది. కృష్ణ అమ్మలా ప్రతి చిన్న విషయం ఎదుటివారి నెత్తి మీద రుద్దాలని చూడడు, ఎదుటి వారి విషయలను తన దృష్టితో కాక, అవతల వాళ్ళ మంచి చెడ్డలతో చూచి యోచిస్తాడు.

ఇంకో సందర్భంలో, 'కృష్ణకి చదువులేదు! డబ్బులేదు! నిజమే! కానీ ఈ ప్రపంచంలో ఏ కాలేజీలు, ఏ విశ్వవిద్యాలయాలు నేర్పలేని ఉత్తమమైన సంస్కారం ఉంది' అంటుంది. అతనికి మీనా తీసిన ఫోటో చాలా బాగా వస్తుంది. అతని చెక్కిళ్ళు, గడ్డం, ముక్కు నుదురు పరీక్షగా చూస్తే తీరుగా అందంగా ఉన్నట్టు కనిపించాయి. చిన్నగా, చురుగ్గా ఉన్న ఆ కళ్ళలో మగసిరి స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ఫోటో తండ్రికి చూపిస్తే ఏదైనా అడుగుగానీ, ఈ ఫోటోలోని వ్యక్తిని మాత్రం అడగకు అంటాడు. తనకంత మాత్రం తెలియదా. ఇంకొకరి వాగ్దత్త అయిన వాడిని ఎలా కోరుకుంటాను అనుకుంటుంది కానీ, తనకి తెలియకుండానే అతని మీద అభిమానం పెంచుకుంటుంది.

'కృష్ణ ఎదురుగా ఉంటే, నాకింత అతి వాగుడు వస్తుంది ఎందుకు? అతన్ని మాటలతో రెచ్చగొట్టబుద్దేస్తుంది. కవ్వించి ఆట పట్టాలనిపిస్తుంది. అతనేమీ అనుకోడనీ నా చనువుని సరదాని అసహ్యంగా అర్ధం చేసుకోడని నాకెందుకో గాఢమైన విశ్వాసం ఉంది. ఈ ప్రపంచంలో నేను ఏ విషయాన్నయినా నిస్సంకోచంగా నోరు తెరిచి చెప్పేయగలిగిన వ్యక్తి ఒక్క కృష్ణే అనిపించసాగింది' అనుకుంటుంది.

కృష్ణకి ఎంతో ప్రియమైన తోటకోసం అతను ఇష్టం లేని పెళ్ళిచేసుకుంటున్నాడని విని అల్లాడిపోతుంది. రాజేశ్వరి చెపుతుంది. నాకు ఆ తోటలో ఏ చెట్టు చూసినా ఏ చిగురు ఏ ఆకు, ఏ కొమ్మ వైపు కళ్ళు కదిపినా నాకు అందులో అన్నయ్య అహోరాత్రులు పడిన శ్రమే కనిపిస్తుంది. అతను సుందరిది దుడుకు స్వభావమే అని తెలిసి కూడా కుటుంబం కోసం తన జీవితాన్నే పణంగా పెట్టటానికి సిద్ధపడతాడు. నేను సర్దుకుపోగలనులే అని వాడన్నాడు. అన్నమాట తప్పని వాడు కాబట్టి సర్దుకు పోవచ్చు కూడా. ఆ సర్దుకు పోవటానికి వాడు జీవితాంతం ఎంత సహనం కూడా తీసుకోవాలో, సుఖశాంతులు ఎంతగా పణం పెట్టాలో నాకు తెలుసు.'

అది విన్నప్పట్నించీ అతనికి ఎలాగైనా ఆ పొలం దక్కేలా చేయాలని తాపత్రయపడుతుంది మీనా. కానీ ఆత్మాభిమానం మెండుగా గల కృష్ణ! 'అయితేవిను, నాకు ఎక్కడా డబ్బు దొరకని పక్షంలో ఆ పొలం వదులుకోవటానికైనా ఇష్టపడతాను కానీ, నీ దగ్గర మాత్రం తీసుకోను' అంటాడు.

'వాడంత మొండివాడిని నా జీవితంలో ఎక్కడా చూడలేదు, నాన్నగారి మాటలు గుర్తుకు వచ్చాయి' అనుకుంటుంది మీనా.

'సారధికి నేను నిశ్చయం కాకపోయినట్లయితే నా మీద అమ్మ అన్ని ఆశలు పెట్టుకోకుండా ఉంటే, ఈ పట్టున నేను ఇతని చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళి ఏ రిజిస్టర్ మ్యారేజో చేసుకుని ఉండేదాన్ని. పెళ్ళంటూ అయితే ఇక అతని ఇష్టం ఏముంటుంది? అంతా నాదే!' అని కూడా అనుకుంటుంది.

'సరే, నేను చెప్పిన మాట వినడం లేదుగా. నా ఇష్టం వచ్చింది నేను చేస్తాను అంటుంది.' చేస్తుంది కూడా. కృష్ణకి తెలియకుండా కృష్ణ పొలం అతని పేర రిజిస్టరు చేయిస్తుంది. అది అతనికి స్వయంగా అతనికి అందజేయాలనుకుంటుంది రాజేశ్వరి పెళ్ళిలో. తను ఇచ్చిన కాగితాలు చూసి, అతని ముఖంలో రంగులు ఎలా మారుతాయో స్వయంగా చూడాలనే కుతూహలం కూడా ఆమె నా ప్రయాణానికి మరీ మరీ కవ్విస్తాయి. అనుకున్నట్లుగానే తల్లి కన్నుగప్పి నిమ్మలూరు చేరుతుంది. కృష్ణని పొలానికి రమ్మని కోరుతుంది, ఇంటి నిండా చుట్టాలు ఉండగా, అక్కడ ఆ తోటలో అతనికి కాగితాలు అందజేయడం ఈ నవలకే హైలైటు. ఎన్నిసార్లు చదివినా తనివి తీరదు.

కృష్ణకి వాగ్దత్త అయిన సుందరి అనుక్షణం వాళ్ళిద్దరినీ ఓ కంట కనిపెడుతూనే ఉంటుంది. 'సుందరి నేను ఊహించినంత అనాకారి కాకుండా, మా అందరిలాగానే ఉండడం నా కేమిటో నిరుత్సాహంగా, నిరాశగా అనిపించింది' అనుకుంటుంది మీనా. 'సుందరిలాంటి స్త్రీలు పరాయివాళ్ళ నీడలు కూడా తమ భర్తలమీద పడనివ్వరు. వేయికళ్ళతో నాది అనే దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం ఉగ్గుపాలతో అభ్యసించిన వ్యక్తి సుందరి అనిపించింది.' అని కూడా అనుకుంటుంది. అయినా కృష్ణని వంటరిగా కలుసుకోవటానికే ధైర్యం చేస్తుంది.

ఒంటరిగా తోటలో కూచున్న అతని దగ్గరికెళ్ళి అతని కళ్ళు మూసి 'ఎవరో చెప్పుకో' అంటుంది. 'ఇంకెవరు ఈ సాహసం, చొరవ నా దగ్గర ఇంకెవరికి ఉన్నాయి?' అంటాడు, అలా సరసంగా మొదలైనా వాళ్ళ సంభాషణ, మీనాకి భయం భయంగానే ఉంది. 'నా కెందుకో ఈ పొలం విషయం చెప్పడం నేననుకున్నంత సులభం కాదని అనిపించింది. సాధ్యమైనంత వరకూ నవ్వులాటల్లో తమాషాగా, చిలిపిగా, అమాయకంగా మెల్లగా బయట పెట్టడానికి నిర్ణయించుకున్నాను.'

రెండు చామంతులు ముక్కలు ముక్కలు చేసి మీనా తలమీద పోస్తాడు. 'నా బుగ్గన కాటుక పెట్టి పెళ్ళికొడుకుని చేశావుగా, పెళ్ళికొడుకు, ఎవరికైనా తలంబ్రాలు పోయద్దుమరీ?' అంటాడు పైగా 'నువ్వు నా వైపు చూసినప్పుడల్లా ఇలాంటి చిలిపి పని ఏదో ఒకటి చేయబుద్ధవుతుంది. కళ్ళెత్తి నావైపు చూడకు మరి.' అని కూడా అంటాడు.

'బాగుంది ఈ దబాయింపు!'

'దబాయింపు కాదు మీనా! నిజంగా చెపుతున్నాను. నువ్వు కళ్ళకి కనిపించగానే నా మనసు ఎంత ఆహ్లాదంగా ఉంటుందో తెలుసా'

> *'రైలు కదిలింది. చివరికి నేనే సంకోచం వదిలించుకుని చెయ్యి చాచాను. అతను అందుకోబోయాడు. కాని అందలేదు'*

అతను అలాంటి మంచి మూడ్‌లో ఉండగానే కళ్ళు మూసుకుని దోసిలి పట్టమని 'భవతీ భిక్షాందేహి' అని కూడా అనమంటావా అన్నది పట్టించుకోకుండా అతని చేతిలో పెట్టేస్తుంది కాగితాలు మీనా. ఊహించినట్టుగానే రకరకాల రంగులు మారతాయి.

'కుతూహలంగా చదవడం ప్రారంభించిన అతను మొదట కనుబొమలు ముడిపడడం, ఆ తర్వాత క్రమేపీ ముఖం వివర్ణం అవటం నేను గమనించకపోలేదు. కాగితాలు పూర్తిగా చదవడం అయ్యేసరికి అతని ముఖం కందగడ్డలా అయింది. చిదిపితే రక్తం చివ్వున చిందేంతగా ఎర్రబడింది.'

'మా డబ్బు ముట్టుకోనని కదూ నీ ప్రతిజ్ఞ! అందుకని -'

'అందుకని? నాకు గర్వభంగం చేశావన్నమాట' కృష్ణ కొట్టినట్టుగా అతని చేతిలో ఉన్న కాగితాలు మీనా మీదకి గిరాటుకొట్టి అక్కడి నుంచీ లేచి వెళ్ళిపోతాడు.

'నువ్వు నా మాట వినవా?' నిష్టూరంగా నెమ్మదిగా అడిగింది మీనా.

'అతను ఛ్రురున ఇటువైపు తిరిగాడు. అతని ముఖం చూడగానే నాకు భయం వేసింది. క్రోధం, అభిమానం, అసహనం, నిస్సహాయత గుండెలని దహించి వేస్తున్నప్పుడు పిండే యాతన అతని ముఖంలో ప్రతిబింబిస్తోంది.'

'ఇంకేవి చెప్పాల్సినవి ఉన్నాయో చెప్పు! చెప్పేసి వెళ్ళు! దయుంచి ఇక్కడ నుంచీ తక్షణం వెళ్ళు! నేను పశువులా మారి నిన్నే అవమానం చేయక ముందు వెళ్ళిపో! అది నీకూ, నాకూ ఇద్దరికీ మంచిది.

*'అతను గబగబా నాలుగడుగులు ముందుకు వస్తే నా చెయ్యి అంది ఉండేది. కానీ ఏ కారణం చేతనో అతను అలా చెయ్యలేదు' అంటుంది మీనా కృష్ణ గురించి ఒక సందర్భంలో.*

'నేను భయంతో అతని వైపు చూశాను. ఉగ్రనరసింహ మూర్తిలా ఆగ్రహంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఇతనికి నచ్చచెప్పడం అనేది నేను అనుకున్నంత సులభం కాదు అనిపించింది' అంటుంది మీనా. అయినా తనకీ, తన తండ్రికీ అతనన్నా, అతని కుటుంబమన్నా ఎంత ఇష్టమో వివరిస్తుంది.

'నీకు సుందరి, నాకు సారథి వాగ్దానం అయిపోయి ఉండకపోతే నిజంగా నీ గర్వం అణిచేదాన్ని! నీ ఇష్టం ఉన్నా లేకపోయినా, నేను మా ఈ ఇంటి కోడలిని అయి నీ మెడలు వంచి ముక్కుకు తాడేసి చెంగుకి ముడేసుకునే దాన్ని!'

ఈ ఆశ్చర్యం నుంచీ కృష్ణ కోలుకోగానే 'వెళ్ళిపోవాలట నేను, వెళ్ళిపోక శాశ్వతంగా నీ ఇంట్లో ఉండటానికి వచ్చాననుకున్నావా?... నీ దగ్గర ఎలాంటి అధికారం అర్హత లేని నేను, నువ్వు పెట్టిన చీర ఎందుకు తీసుకోవాలి? నాకోసం నువ్వు బెజవాడలో అంత డబ్బు ఖర్చు చేస్తే ఎందుకు ఊరుకోవాలి? ఏం అభిమానం అనేది నీ ఒక్కడి సొత్తేనా? అది ఇంకెవరికీ ఉండదా?!' అని కొంత డబ్బు తీసి అతడికి ఇస్తుంది.

కృష్ణ కోపం సర్రున దిగిపోతుంది.

'అయ్యగారి బలహీనత ఎక్కడో నాకిప్పుడు తెలిసిపోయింది. అతనికి ముందుగా మనం కోపం తెచ్చుకోవాలి! అతను అనబోయిన మాటలన్నీ మనల్ని మనమే అనుకోవాలి! ఈ రహస్యం సుదరికి చెప్పాలి తప్పకుండా!'

కృష్ణ వెళ్ళి కొలను గట్టు మీద కూర్చున్నాడు. మీనా వెనకనుంచీ చెయ్యి చాచి డబ్బు అందిస్తుంది. కృష్ణ హఠాత్తుగా, తన చెయ్యి పట్టి బలంగా గుంజి,' ఓడిపోయాను మీనా! చిత్తుగా ఓడిపోయాను' అంటాడు. రెండో చెయ్యి అతని ఎడమ భుజం మీంచి ముందుకు పోనిచ్చి ఓదారుస్తుంది. కృష్ణ మీనా రెండు చేతులని తన గుప్పెట్లో పట్టుకుంటాడు.

'మాకు క్రిందగా, కొలనులో, నీళ్ళు నిశ్చలంగా ఏమాత్రం కదలిక లేకుండా ఉండటంతో ఆ నీళ్ళలో మా ఇద్దరి ప్రతిబింబాలు అద్దంలోలా కనిపిస్తున్నాయి. నా చెంప అతని చెంప దగ్గరగా ఉంది.

కానీ ఒక్కటే అర్థం కావటంలేదు చదువురాని, ఈ పల్లెటూరి మూర్ఖుడిమీద, నీకెందుకింత కనికరం అని?

ఈ మనిషి కాస్త మూర్ఖుడే! కాని చదువురాని వాడు మాత్రం కాదు! చదువు వచ్చునని గర్వంగా చెప్పుకునే చాలా మంది కంటే సమర్థుడని నాకు తెలుసు!' మళ్ళీ సంభాషణ సరసంగా మారుతుంది. మానసికంగా శారీరకంగా అతి సన్నిహితంగా ఉన్న వాళ్ళు దాదాపు ఆ పరిసరాలే మర్చిపోయారు.

మీనాని వెన్నంటుతున్న సుందరి అక్కడికొచ్చి వీళ్ళిద్దరినీ అలా సన్నిహితంగా చూస్తుంది. ఇంక అక్కడి నుంచీ చక చక ఎన్నో మలుపులు తిరిగిపోతుంది కథ. మీనాని పెళ్ళి చూడకుండా పంపేయమని సుందరి కోరటం, కృష్ణ ఒప్పుకోకపోవడంతో సుందరి కోపంగా వెళ్ళిపోవటం, సుందరి నాన్న రాజేశ్వరి పెళ్ళి చెడగొట్టటం, రాజేశ్వరిని మీనా తనతో తీసుకురావటం, తండ్రి కోపగించుకోవటం, మీనా

తల్లి రాజేశ్వరి ఎవరో తెలియక ఆపేక్షగా చూడటం, రాజేశ్వరి మీద సారథి ఆసక్తి చూపటం, మీనా కృష్ణని హైదరాబాద్ వచ్చినప్పుడు రహస్యంగా కలుసుకోవటం, సారథికి మీనా మీద అనుమానం వచ్చి రాజేశ్వరిని నిఘావేయమని కోరటం వగైరా వగైరా!

కృష్ణకి కూడా మీనా అంటే ఇష్టమే. 'నన్ను చూడగానే అతని కళ్ళలోకి వింతయిన కాంతి ఛెంగున ఎగిరి వస్తుంది. ఇది నేను చాలాసార్లు గమనించాను. బహుశ ఈ విషయం అతనికి కూడా తెలియదేమో' అనుకుంటుంది మీనా. ఒక సందర్భంలో కృష్ణ అంటాడు. 'మీనా! సిగ్గు విడిచి నిజం చెప్పనా? నువ్వు వస్తున్నావని మావయ్య ఇచ్చిన టెలిగ్రాం అందుకున్న క్షణంలో నేను పొందిన ఆనందం అనూహ్యం. ఒక మనిషి రాకలో, ఒక మనిషిని చూడబోతున్నానని అనుకోవడంలో మనిషి ఇంత ఆనందం ఉద్వేగం పొందగలడని నాకింతవరకూ తెలియదు. నాకీ ఆనందం ఎందుకని రాత్రి నుంచీ నన్ను నేను ప్రశ్నించుకుంటూనే ఉన్నాను'

మీనాతో ఒకసారి అంటాడు. 'నీ స్వభావం చాలా చిత్రమైంది. నువ్వు ఎదుటి వాళ్ళతో ఎంతో చనువుగా రెచ్చగొడుతున్నట్టుగా మాట్లాడతావు. తీరా ఆ ఎదుటి వాళ్ళు కాస్త చనువుగా సమాధానం ఇస్తే నువ్వు భరించలేవు. నిన్ను చిన్న బుచ్చారనుకుంటావు.'

మీనా తల్లిదండ్రులకి చెప్పకుండా, చివర్లో అనుకోని పరిస్థితుల్లో మీనాని పెళ్ళిచేసుకోవాల్సివచ్చినప్పుడు, 'మీనా! నువ్వు కనిపించినప్పుడల్లా నన్ను సుడిగాలిలా ఉక్కిరి బిక్కిరి చేస్తూనే ఉన్నావు. జీవితంలో సవాలు ఎదుర్కోటమంటే నాకిష్టమే. కానీ ఇంత పెద్ద సవాలుగా నువ్వు న జీవితంలోకి వస్తావని నేను కలలో కూడా అనుకోలేదు' అంటాడు. ఆ సవాలు సవ్యంగా ఎదుర్కొని నిలిస్తే పెద్దవాళ్ళందరూ కలిసిపోయి, విడిపోయిన రెండు కుటుంబాలు ఒకటవుతాయి. కృష్ణ తోటలో కూర్చుని అత్తా, అల్లుడు కొత్త బిజినెస్‌లు కూడా ప్రణాళికలు వేస్తారు. తర్వాత అక్కడ కొత్త జంటని ఒంటరిగా వదిలి వెళ్ళిపోతారు.

'మీనా రెండోసారి లాలనగా పిల్చాడతను. అది పిలుపులా లేదు నాకు. ఆ క్షణంలో, అతని కంఠం వేయి గొంతులుగా మారి, అతని ప్రతి రూపం అయిన ఆ తోటలో ప్రతి చిగురులోంచీ ప్రతి ఆకులోంచీ, రెమ్మ రెమ్మనుండీ, కొమ్మ కొమ్మలోంచీ, 'మీనా మీనా మీనా' అని మృదు మధురంగా ప్రతిధ్వనిస్తూ పిలుస్తున్నట్లు అనిపించసాగింది.

తోటలో ప్రతి ఆకు, ప్రతి చిగురు నా వైపు ఆపేక్షగా చూస్తున్నట్టు అనిపించసాగింది. నిజం చెప్పాలంటే కృష్ణ వ్యక్తిత్వాన్ని అద్దంలా పట్టి నాకు చూపించింది ఈ తోటే! మేం ఇద్దరం సన్నిహితంగా అవటానికి ఈ తోటే కారణం. ఈ తోట కృష్ణకి లేకుండా పోతుందేమోనని ఒకప్పుడు భయంతో నా గుండెలు ఎంత విలవిలలాడాయో! '